# అగ్నిపూలు

(మినీ కవితలు)


## శైలజామిత్ర

ప్రచురణ

**సాహితీమిత్రులు**

మచిలీపట్నం

స్థాపితం-1981 రినెం.203/2001



# AGNIPULU

*(MINIPOETRY)*

## SAILAJAMITHRA

*M.A ENG..MA.TEL..PGDCJ..*
*DIP..KARNATIC MUSIC..*

98, SOUJANYA AVENUE, SBI COLOLNY,
GANDHINAGAR, HYDERABAD-500 080
PH: 9290900879....9550367430
Sailajamithra@gmail.com

***For Copies***

*Smt.* **NARRA PRABHAVATHI** MA..MEd..
4-290, Godugupet,
MACHILIPATNAM

VISHAALANDRA ALL BRANCHES
PRAJASHAKTHI, ALL BRANCHES
NAVODAYA BOOK HOUSE, CHIKKADAPALLY HYD
DISA PUSTHAKAKENDRAM, CHIKKADAPAALY
TELUGU BOOK HOUSE, KACHIGUDA, HYD
NAVODAYA BOOK HOUSE, SULTANBAZAR, HYD.

***Price :***








జీవితానికి అర్ధం తల్లి
అద్దం పెళ్ళి
అర్థంలో పరమార్ధం సాధించకున్నా
అద్దంలో సంపూర్ణత్వం చూపిన
సత్యమిత్రకు అంకితం

- *శైలజామిత్ర...*



ఓలేటి పార్వతీశం

## వెలుతురు చినుకులు

నామటుకు నాకు ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి ఒక కవిలానే కనిపిస్తాడు. అదెలా సాధ్యమండీ అనిపిస్తోంది కదూ! నిజమే ప్రపంచంలో ప్రతి ఒక్కరూ కవి కాలేరు. ఈ రెండూ ఒకదానికి మరొకటి భిన్నమైన ప్రకటనలు కదా! ఆలోచించి చూడండి ఆ భిన్నత్వంలో ఏకత్వం కూడా వుంది. ఎలాగంటే ప్రతి మనిషికి ఏదో ఒక సందర్భంలో ఏదో ఒక సంఘటనలో హృదయం కదిలేలా ఏదో ఒక భావన తప్పకుండా కలుగుతుంది.. తనకు కలిగిన ఆ భావనను, అందుబాటులో వున్న భావ సహాయంతో ఎదుటివారి హృదయం కూడా కదిలించగలిగేలా ఆవిష్కరించగలిగిన వారు కవిగా చలామణీ అవుతారు. అలా ఆవిష్కరించే ప్రతిభాపాటవాలు లేనివారు మాత్రం, ఆ భావనలను తమ హృదయాల్లోనే పదిలం చేసుకుంటారు. తమ అంతరాత్మలకు తెలిసిన వారు కవులే అయినా,బాహ్యప్రపంచానికి కవులుగా పరిచయం కాలేకపోతున్నారు. అంతే తేడా...

కవులు కూడా రకరకా లుంటారు. అక్షరాల కవులు, అక్షరాలా కవులు.. నిజానికి కవులస్థాయిని వారి కవిత్వమే నిర్ణయిస్తుంది. కవిత్వంలో భావతీవ్రత ఆ కవి స్థాయిని మనకి తెలియజేస్తుంది. భావతీవ్రతతో పాటు,భావవ్యక్తీకరణ కూడా ప్రధానమైనదే.. ఒక గొప్పభావాన్ని అందమైన మాటల్లో పొందికగా అందించగలగడం ఆ కవి సృజనాత్మకతను మనకు తెలియజేస్తుంది. ఇవాళ ఈ





ఆధునిక సాహిత్య కాలంలో కవిత్వమనే ఒక ప్రక్రియ శాఖోపశాఖాలుగా విస్తరించిపోయింది. దీర్ఘంగానో, హ్రస్వంగానో కవిత్వమనే ప్రక్రియ ఖండఖండాలై ఎన్నోరూపాల్లో ఒదిగిపోయింది. అయితే కవిత్వం ఎన్ని ఖండాలైనా కలకండలాంటి కవిత్వం మెండుగా వస్తూనే వుంది..

ఇలా కండగల కవిత్వాన్ని తరచుగానే రాస్తూ తన ఉనికిని చాటుకుంటున్న కవయిత్రి శ్రీమతి శైలజామిత్ర. నిజానికి శైలజామిత్రను ఒక్క కవయిత్రి చట్రంలోనే బిగించడం కుదరదనుకుంటాను. ఎందుకంటే ఆమె రచయిత్రికూడా.. కథలు, నవలలు, లెక్కకు మిక్కుటంగానే వ్రాసారు. అంతేకాదు, ఆమె మంచి అనువాదకురాలు, సమీక్షకురాలు కూడా.. చాలా పత్రికలలో ఎన్నో పుస్తకాలపైన ఆమె వ్రాసిన సమీక్షలు మనకు దర్శనమిస్తుంటాయి. అక్కడితో అయిపోలేదు.. సాహిత్యరంగంలో వన్నెకెక్కినవారిని ఎంపిక చేసుకుని, వారిని వారి రచనలను పత్రికాముఖంగా పాతకులకి పరిచయం చేస్తుంటారు. ఏమైనా ఆమె కృషి పలుమార్గాల్లో సాగుతోంది.. సరే.. మిగిలిన పార్శ్వాలను కొంతసేపు పక్కనపెట్టి, కాస్సేపు ఆమె కవితామూర్తిని పరికిద్దాం..

ఇదొక మినీ కవితలసంపుటి.. అంతేనా మెనీ కవితల సంపుటికూడా.. ఈ సంపుటిలో ఆమె కవితలు శతమానాన్ని రెండుసార్లు దాటాయి. ఇందులో కొన్ని సృజనాత్మకంగా వున్నాయి. మరికొన్ని ఆలోచనాత్మకంగావున్నాయి. ఇంకొన్ని కవితాత్మకంగా వున్నాయి. మొత్తంమీద చివరికంటా చదివిస్తాయి.

**"కొన్నాళ్లక్రితం**
**నా గుండె ప్రశాంతతను కోల్పోయింది**
**ఇపుడా అవసరం లేదు**
**నాగుండె తన ఉనికినే కోల్పోయింది.."**

ఈ చిన్న కవితను మూడు వాక్యాలుగా విభజించుకుంటే మొదటివాక్యం స్టేట్‌మెంట్‌లావుంది... రెండవవాక్యానికొస్తే ఒక వ్యతిరేకార్థాన్ని స్ఫురింపచేసి, ఆసక్తిని కలిగిస్తోంది.. మూడోవాక్యం రసార్థంగా వుంది. మొత్తం మీద ఈ ఖండికలో ఆలోచనాత్మకమైన అంశం వుంది. నిర్మాణంలో మంచి టెక్నిక్‌వుంది. ఈ కళను కవయిత్రి అడపా దడపా బాగానే ప్రదర్శించారు.

సాక్ష్యం కావానుకుంటే ఇది గమనించండి..

**"ఆకాశంలో పక్షి ఎగిరెగిరి**
**నిర్జీవంగా నేలరాలింది**
**అదే నయం..**

**కాస్సేపయినా హాయిగా ఎగిరింది"**

మళ్ళీ మూడువాక్యాలు.. మొదటివాక్యం కళ్లముందు జరిగిన సంఘటన తాలూకు స్టేట్‌మెంట్.. రెండవవాక్యంలో వ్యతిరేకార్థం స్ఫురించే ఆసక్తి.. మూడోవాక్యంలో గొప్ప ఓదార్పు వుంది..

**ఆవిడ ఎంతో కష్టపడి కారు కొనుక్కుందట**
**అంతకన్నా కష్టపడి ఇల్లుకూడా కొనుక్కుందట**
**అంత కష్టమెందుకు**

**ఖరీదైన మొగుడ్ని కొనుక్కుంటే పోలే"**

ఇది కూడా మూడు వాక్యాలుగా విభజించుకుంటే మొదటివాక్యంలో ఒక స్టేట్‌మెంట్, రెండోవాక్యంలో మరొక స్టేట్‌మెంట్, చివరికి వచ్చేసరికి అద్భుతమైన చమత్కారంతోనే ఆ ఖండికకు మంచి అలంకారం చేసారు..

మొదటివాక్యంలో గొప్ప గర్వాన్ని ప్రదర్శించి, ఆ వెంటనే మరోవాక్యంలో ఆ భావాన్ని కరుణాత్మంగా మార్చేయాలంటే మంచి భావనాబలం కావాలి. ఇది గమనించండి..

**"నదులన్నీ నాతోనే వుంటాయి**
**కళ్లల్లోనూ గుండెల్లోనూ నిరంతర ప్రవాహం"**

కళ్ళముందు ప్రతినిత్యం గమనించే వాస్తవాలనే, కొత్తగా చూడటం మరింత కొత్తగా చెప్పగలగటం, కవికి ఆవశ్యకమైన మంచి లక్షణం. వాస్తవాలనే కానీ, కవయిత్రి చెప్పిన విధానం చూడండి..

**" కనిపెంచిన అమ్మ వంటింటిలో ఒక మూలగా కూర్చుంది**
**కనిపించిన అమ్మాయి ఏకంగా అతని గుండెలోనే కూర్చుంది"**

స్త్రీ ఒక్కరే కానీ, ఆమెపాత్ర మారగానే పురుషుడి ప్రవర్తన ఎలా మారుతుందో





ఇక్కడ ఆమె బొమ్మ కట్టించారు..

వాస్తవాలను చెబుతూనే, వాటికి విలువలతో ముడివేసి చెప్పడం నాకు ఒకింత ఆనందాన్నే కలిగించింది. మీకు ఒక ఆలోచన కలిగిస్తోంది గమనించండి..

**"గాంధీతాత రోడ్లపై ఇప్పటికీ నాకు ఎదురవుతుంటాడు**
**కాకుంటే, వెండిలో మెరుస్తుంటాడు"**

వాళ్లని కళాకారులనాలో, బిచ్చగాళ్ళనాలో, నాకు ఇప్పటికీ తెలియదుకానీ, గాంధీజీ వేషంలో మనకు అడపాదడపా రోడ్ల కూడలిలో కొందరు వ్యక్తులు దర్శనమిస్తారు. ఒళ్ళంతా తెల్లని సున్నేరు పూసుకుని, చేతిలో కర్ర పట్టుకు బొమ్మలా నిలబడతారు. అటూ ఇటూ పోయే జనం, కనీసం కొందరైనా మనసు కరిగి ఏవో చిల్లర డబ్బులు వేసి వెళ్తుంటారు. దానికి సంబంధించిన మినీకవిత ఇది. ఇంతవరకు నేను చెప్పిన ఈ ఉపోద్ఘాతంలో కవిత్వాంశమేమీలేదు. మరెందుకు ఇదంతా చెప్పినట్లు.. చిత్తగించండి.. ఒక గొప్ప ఆలోచన.. ఒక గొప్ప భావన, ఎక్కడుందో విన్నవిస్తాను. భారతీయులందరికీ బాపూజీ జాతిపిత..బంగారంకంటే వెండికి విలువ తక్కువ.. అంటే కాలగమనంలో, ఈ తరాల మార్పులో ఆ మహనీయుడి విలువ తరిగిపోతోందని నర్మగర్భంగా చెప్పారు కవయిత్రి. భావప్రకటనలో శైలజామిత్ర సాధించిన విజయం ఇది..

సత్తావున్న కవికి, వస్తువు ఏదైనా కానీండి.. దాన్ని కవిత్వంలో పొదగడం పెద్ద విషయమేమీ కాదు. కళ్ళముందుండే విషయాల్నే గుండె కలుక్కుమనేలా అందిస్తారు.. మచ్చుకు ఒకటి మీముందుంచుతాను..

**"పిల్లలతో పాటు ఆమెకూడా**
**అమెరికాలో స్థిరపడింది**
**అయితే వంటింట్లో.."**

ఈ మధ్య వచ్చిన ఆర్థిక మాంద్యాన్ని కాస్సేపు పక్కకు పెడితే యువతరంలో అమెరికా వ్యామోహం విచ్చలవిడిగా వుంది. చదువులపేరుతో అమెరికా వెళ్ళినవారంతా ఏదో ఒక ఉద్యోగం వెదుక్కుని అక్కడే స్థిరపడిపోవడం నేర్చుకున్నారు. డాలర్లమీద ఆశ మాతృదేశాన్ని మరిపింప చేస్తోంది. కాస్త ఆర్థికంగా

పుంజుకోగానే, తల్లితండ్రులకి ఏదో కాసిని వసతులు ఏర్పాటు చేసి దేశాన్ని ఓల్డ్ఏజ్‌హోమ్‌లుగా మార్చేస్తున్న వాళ్ళు కొందరైతే, ఉన్న ఒక్క తండ్రినో, తల్లినో జీతం అవసరంలేని పనిమనుషుల్లా అమెరికాలో దిగుమతి చేసుకుంటున్నారు.. అమెరికాలో స్థిరపడటం అంటే గొప్పగా చెప్పుకునే రోజుల్నించి అమెరికాలో స్థిరపడటమంటే దిక్కుమాలిన రోజులనే స్థితికి వచ్చింది పరిస్థితి.. **" ఆమె పిల్లలతో పాటు అమెరికాలో స్థిరపడింది"** అంటూ కవయిత్రి ఆమెకు కలిగిన విదేశీహోదాను ఆవిష్కరిస్తూనే **"అయితే వంటింట్లో"** అంటూ గుండె కలుక్కుమనేలా కఠోరవాస్తవాన్ని కళ్ళముందుంచేరు. గుండె వున్న ప్రతివారు ఇటువంటి వాక్యాలు చదివితే విలవిల్లాడిపోతారు.

అందరికీ తెలిసిన వాస్తవాల్నే మరోసందర్భంలో ఎంత అందంగా చెప్పారో చూడండి..

**"నేటి సినిమా రిలీజయింది**
**ఆదిమానవుడు తొలిసారిగా**
**సిగ్గుపడటం నేర్చుకున్నాడు"**

ఈ రోజున సమాజంలో అత్యంత వ్యామోహం కలిగించే మాధ్యమం కచ్చితంగా సినిమా.. ఒకవైపు గొప్ప గుర్తింపు, మరోవైపు ఊహించనంత డబ్బు.. ఈ రెండు కారణాలు యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. భాషలకు అతీతంగా భారతీయ సినిమా విలువల్ని మర్చిపోయి చాలాకాలమయింది. నూటికి తొంభైశాతం సినిమాల పరిస్థితి ఇదే... ఇంకా పెద్ద దుస్థితి ఏంటంటే కథలో విలువల్నేకాదు.. కథానాయకుల ఒంటిమీద వలువల్ని కూడా మర్చిపోతున్నారు. అసభ్యకరమైన, ఆహార్యానికి ఇవాళ సినిమా ఒక చిరునామా.. ఈ వాస్తవాన్ని చమత్కరిస్తున్నట్లుగా కవయిత్రి గొప్ప చురకవేశారు.

నేటి సినిమా చూస్తున్న నాగరిక సమాజం, ఏమిటీ అసభ్య ప్రవర్తనలు, సంభాషణలు, ఆహార్యాలు అని తర్కించుకోవడం సహజమే.. కానీ కవయిత్రి విసిరిన విసురు ఎక్కడ గుచ్చుకుంటుందంటే **"ఆదిమానవుడు తొలిసారిగా సిగ్గుపడటం నేర్చుకున్నాడు"** అనడంలోనే వస్త్రధారణలోనూ, జీవన ప్రమాణాలలోనూ,మనం అనాగరికులనుకునే ఆదిమానవులు. నేటి సినిమాలు చూసి సిగ్గుపడటం అనేది చెంపచెళ్ళుమనిపించేలా వుంది..





శైలజామిత్ర అక్కడా, అక్కడా వేసిన కొన్ని భావప్రకటనలు మనం ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేస్తాయి.. ఈ పరిస్థితికి మనం కూడా బాధ్యులమా? అని మన భుజాలు మనమే తడుముకునేలా చేస్తాయి.. ఈ అద్భుత భావప్రకటన ఒళ్ళు జలదరింపజేస్తుంది..

**"బాపూజీ కలలు కన్న**
**భారతదేశం ఇది**
**అందుకే కర్రతో కాపలా..."**


గొప్ప భావప్రకటన ఇది. ఆమె చాలా ప్రతిభావంతంగా వ్రాసారు. గాంధీజీ ఏదో గొప్ప స్వర్ణభారతాన్ని కలలు కన్నారని, ఇంతకన్నా గొప్ప రామరాజ్యాన్ని కలలు కన్నారని, మనకు అపోహలు అవసరంలేదు. ఈ పరిస్థితిని ఆయనెపుడో అంచనావేసారు. అందుకే ఈ దుస్థితి వున్న దేశంలో ఆయన కర్రతో కాపలాకాస్తున్నారు. ఈ పరిస్థితికి వాడవాడలా కర్రతో నిల్చునే గాంధీజీవిగ్రహం మనకు సాక్ష్యమిస్తున్నట్లు కనిపిస్తోంది..

ఏదో మచ్చుకుకొన్ని చెప్పానేకానీ, ఇలా మెచ్చదగిన ఖండికలు ఈ కవితా సంపుటిలో చాలానేవున్నాయి.. ఈ సంపుటికి మిత్రులు డా॥ శ్రీ రావి రంగారావు " అగ్నిపూలు" అనే నామకరణం చేయడం ఔచితీభరితంగానే వున్నదనిపిస్తుంది.. పూర్వం తురాయి చెట్లని వుండేవి.. ఎర్రటిపూలతో ఆ చెట్లు ఆకర్షణీయంగా వుండేవి. కణకణలాడే నిప్పురంగులో వుండే ఆ పూలను అగ్నిపూలనేవారు. అలాగే దీపావళి నాడు మనం బాణాసంచాకాలుస్తాం.. అందులో మతాబులు, చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులు ఇవన్నీ వెలుగులు చిమ్ముతూ పూలను వర్షిస్తాయి.. అవికూడా అగ్నిపూలే.. కొన్నిక్షణాలే అయినా, ఆ అగ్నిపూలు మన కళ్ళను కాంతివంతం చేస్తాయి. అలాగే ఈ సంపుటిలోని క్లుప్తఖండికలు, మన ఆలోచనల్ని కాస్సేపు వెలిగిస్తాయి.. ఆ వెలుగులు మన మనసుల్లో చాలాకాలం గుర్తుంటాయి...

ఈ ధోరణి శ్రీమతి శైలజామిత్ర ముందు కాలంలో మరిన్ని మంచి కవితాసంపుటాలను ఆవిష్కరించడానికి దోహదకారి అవుతుందని భావిస్తూ అభినందనలు..

**డా॥ వోలేటి పార్వతీశం**
505, మాఫర్ ఎనక్సీ
10-2-11, ఎ.సి.గార్డ్స్,
హైదరాబాద్-500 004.

27-4-10
హైదరాబాదు.



సుధామ

## అగ్నిపూల కాంతి పరిమళం

"Every poem is created by a journey through darkness and return to light, the journey from light back to light which cannot be made except through darkness, and the finished poem is the image of that journey" - C.D.Lewis

మారుతున్న కాలాన్ని అనుసరించి, మారుతున్న సాహిత్య ధోరణులను అనుసరించి, కవితా విమర్శక సూత్రాలు కూడా మారాలి! లక్ష్యాన్ని అనుసరించి లక్షణాలు ఏర్పడవలసిందేకానీ, లక్షణాన్ని అనుసరించి జీవనది లాంటి సాహిత్యం, ముఖ్యంగా 'కవిత్వం'సాగదు.

వ్యక్తిప్రాధాన్యం తగ్గి, సామాజిక ప్రాధాన్యం గుర్తించిన తరువాత-ఆధునిక జీవితం అనేక విజ్ఞాన సాంకేతికాది విషయాల్లో గతిశీలమైన తర్వాత, కవిత్వంలో మార్పులు కనవస్తూనే వుంటాయి. పైకి వ్యక్తినిష్ఠంగా కనబడేదే అయినా, ఆ 'నేను' సామూహికతకు ప్రాతినిధ్యమే వహిస్తుంది.

ప్రవాహసదృశమైన కవిత్వంలో కొత్తపరివర్తనలు రావడం సహజం. నిత్యనూతనత్వం అనేది ప్రకృతి సిద్ధమైన స్వభావంలోనేవుంది. ప్రగతిమార్గంలో కొత్తకొత్త విలువలు పుడుతూంటాయి. ఆ విలువలను కవి స్వీకరిస్తూంటాడు. ఒకే కవిలో విభిన్నమైన భావధారలు అందుకే కాలానుగుణంగా చూస్తూనే ఉంటాం.

విషయాన్ని సూటిగా ఎంచుకున్న వ్యక్తీకరణలో క్లుప్తత, ఒక భావలయ,





పరిమితకాలంలోనే హృదయానికి అనుభూతిని, బుద్ధికి ఆలోచనా సంప్రీతిని అందించే వైఖరి, వ్యంగ్యం, చమత్కారం, సందేశం, సామాజిక స్పృహ, కేవల భౌతికాభివృద్ధితో సంతృప్తి చెందని ఒకానొక అంతర్ముఖీన ఆంతర్యానుభవ అభివ్యక్తి స్వీకరణ వంటి అంశాలన్నింటినీ - లఘుకవితారూపాలను స్వీకరిస్తున్న కవులు నేడు ఉపయుక్తం చేస్తున్నారు ! అదీకాక, జ్వాలాముఖి అన్నట్లుగా 'వేగవంతమైన సామిజిక జీవితానికి వ్యాఖ్యానంలేని క్లుప్త అభివ్యక్తి ఒక మార్గాంతరం. ఒక సర్దుబాటు. మినీకవిత, లఘుకవిత మున్నగు ప్రక్రియలన్నీ క్లుప్తతను నిర్వహించడానికి వచ్చిన రూపపరిమితులే. వేగానికి క్లుప్తత అనివార్యం..

అయితే క్లుప్తత నుండే గాఢతను, సాంద్రతను రసాభివ్యక్తిని సాధించగలగడం కవి ప్రతిభ మీద ఆధారపడి వుంటుంది. సంగ్రహంగా, విశిష్టంగా, వైచిత్రితో కూడిన కవిత - ధారణకు కూడా వీలు కల్పించి, కవిత్వం జ్ఞాపకానికినిలిచే గొప్పతనాన్ని కూడా సంతరించుకోగలుగుతుంది. లఘుకవిత్వ రూపాల ప్రయోజనం ఇది కూడాను! అందుకే నేడు - నానీలు హైకూలు, రెక్కలు, చుక్కలు వంటి మినీకవితా రూపాలు కవులకు సౌలభ్యంగా, పఠితకు సౌకర్యంగా మారాయి.

శ్రీశ్రీ పేర్కొన్నట్లు **'మినీకవిత ఐతేనేం - ఏ కవిత్వం మీదనైనా నాకుసదభిప్రాయమే ఉంది. ఎక్కడ దొరికినా, ఏ సైజులో దొరికినా, కవిత్వాన్ని అభిమానించడం మానలేను'** అనుకునే సహృదయులవల్లే లఘుకవిత్వరూపాలకు ప్రాచుర్యం లభిస్తోంది.

ఈ ప్రాతిపదికలపైనే నేటికాలం కవయిత్రులలో 'శైలజామిత్ర' తనదైన ఉనికిని,మనికిని స్థిరపరుచుకుంటోంది. వచనకవితారచనలో అభివ్యక్తి ప్రావీణ్యంతో మంచి కవయిత్రిగా ప్రగతిశీలమవుతోంది. కాలం వెంట కదలి, కాలానికి నిలిచే కవయిత్రిగా ఎదిగే క్రమంలో - ఇప్పుడు మినీకవితలను సంపుటీకరిస్తోంది. ఏది చెప్పినా కవిత్వం చెప్పడం కదా ముఖ్యం! ఇంతకుమునుపే **'శంఖారావం, మనోనేత్రం, నిశ్శబ్దం, తరంగాలు, అంతర్మథనవేళ'** వంటి ఉదాత్త వచనకవితా సంకలనాలు వెలువరించిన శైలజామిత్ర ఆంగ్లంలో కూడా కవిత్వం రాసే ప్రవీణ, **'సిల్వర్‌లైన్స్'** ఆంగ్ల కవితల సంపుటి ప్రచురించడమే కాక, తనకునచ్చిన తెలుగు కవిత్వాన్ని అనువాదం చేయడంలో కూడా 'అందెవేసినచెయ్యి' అనిపించుకుంటోంది.

ఇప్పుడు ఈ **'అగ్నిపూలు'** మినీకవితల్లో **'అగ్నిజల్లినా అమృతం కురిసినా అందం ఆనందం దాని పరమావధి'** అన్న తిలక్ మాటలకు అచ్చుమచ్చు తిలకంగా భావిస్తోంది. వర్తమాన సమాజాన్నీ, సంఘటనల్నీ, సామాజిక స్థితిగతుల్నీ

అక్షరీకించడంలో, ఒక కవయిత్రిగా స్త్రీల మనఃప్రపంచాన్నీ, సమాజంలోని అస్తిత్వాన్నీ అభివ్యక్తీకరించడంలో, అదే సమయంలో ఒక వ్యంగ్యవచోవైభవాన్ని రూపుకట్టించడంలో – ఈ '**అగ్నిపూలు**' భావపరీమళాలను ఎగదోయడంవిశేషం! తెలిసిన విషయాలే అయినా, తెలియచేసే పద్ధతిలోని నిపుణత ఆకర్షిస్తుంది.

**చేతిలో సెల్‌ఫోన్**
**కంటిముందు ఇంటర్నెట్**
**నిండుజీవితాలలో**
**బంధాలన్నీ కట్**

అంటూ ఆధునిక సాంకేతికత, మానవీయతకు అవరోధమవుతున్న వైఖరికి ఆర్తి చెందుతుంది.

**రైతుగుండె**
**ఆగిపోయింది**
**పర్లేదు**
**రైతు**
**దేశానికి**
**వెన్నెముక**

అనడంలో – వ్యాఖ్యానం ఎంతయినా చేయగలిగిన, అన్నదాత వర్తమాన దుస్థితి ప్రతిబింబిస్తోంది! వ్యవసాయస్థితిగతులు, రైతుల ఆత్మహత్యలు, ప్రభుత్వవైఫల్యాలు ఎన్నింటినో ఒక్కసారిగా కనులముందు కదిలింపచేస్తుంది. కవయిత్రి కలం నవ్యంగా ఉందనటానికి దాఖలాలు ఇవి కొన్ని : 'దేశంకోసం – ఏదో ఒకటి చేయాలి – కనీసం ఉద్యమాలైనా' – అతను – చాలా గొప్పవాడు – అందుకే – విమానం నుండి కింద పడ్డాడు'– 'ఆకాశం చిల్లుపడ్డది – ఊర్లన్నీ – నిండిపోయాయి – తేలుతుందొక్కటే – రాజకీయం' – 'జై తెలంగాణా ! జైజైసమైక్యాంధ్రా...!! అన్నమో.. రామచంద్రా...!!! వీటిలోని కాంతిచ్ఛటలు వేరే విశదీకరించాలా ?

ఒక స్త్రీగా శైలజామిత్ర ఈ అగ్నిపూలలో తనదైన జెండర్ స్వరాన్నీ బలీయంగా చూపింది ! సంసారం సాగరం అంటారు కదా ! అందుకే తానిలా అంటుంది.





**"వారు గజ ఈతగాళ్లు**
**సాగరంలోకి ఉదయమనగా వెళ్ళి**
**రాత్రి బయటకు వచ్చారట.**
**నేనేనయం**
**ఇరవైఏళ్ళ కిందట**
**లోపలికివెళ్లి ఇప్పటిదాకా రాలేదు"**

అని చమత్కారంగా అంటున్నా, అందులో ఎంత గాఢతవుందో గుర్తించగలం! **'నాన్న నన్నెప్పుడూ ఆదరించలేదు – బహుశా నాముఖంలో వాళ్ల అమ్మ కనిపించిందేమో', 'ఏడుకొండలు ఎక్కితే ఆ శ్రీనివాసుడు దయతో కనిపించాడు– ఏడేడు జన్మలు కలసినడిచినా – శ్రీవారు శ్రీమతికి కనిపించడు', 'మా ఇంట్లో గడియారం పేరు – అనసూయ – మా అమ్మ', 'అతను చాలా మంచోడు – అడగకనే అన్నీ ఇస్తాడట – భార్యకు తోడుగా మరో భార్యను కూడా... రాతిబొమ్మ', 'ఆమె దోసిట్లో సముద్రం వుంది – కన్నీటి ప్రవాహంతో', 'బతికున్నప్పుడు – అమ్మకు నాలుగు గోడలే ప్రపంచం చేశారు – పోయాక ఇన్నేళ్ళ వేడిని గుర్తించారేమో – ఐస్‌లో వుంచారు'...** వీటన్నింటా ఆమె రూపుకట్టించిన స్త్రీ చిత్రపటాన్ని మనం **'అగ్నివర్ణాలతో'** అందుకోగలం. **'పురుషుడు ఆకాశం...స్త్రీ అవని, స్త్రీ పురుషులిద్దరూ ఎప్పుడూ కలవని సముద్రాలు'** అని శైలజామిత్ర అన్నప్పుడు – **'ఒకటిగా శయనించే దాంపత్యం తలల్లో సప్తసముద్రాల అనుల్లంఘనీయ వ్యత్యాసం'** అన్న చలం గుర్తొస్తాడు.

**'అతను మాట్లాడుతూ మాట్లాడుతూనే పోయాడట. పాపం బహుశా భార్య తనను కూడా మాట్లాడించిందనే ఆనందంతో కాబోలు'** వంటి జోక్‌లు కొన్ని కనబడినా, కొన్ని కఠోర వర్తమాన సత్యాలనూ ప్రకటిస్తుంది. **'ఇపుడు బాల్యం విలువ పెరిగిపోయింది ఎల్‌కేజీకి పాతికవేలు', 'అతడు స్వదేశంలో ఎంతో కష్టాలకోర్చి మేథస్సును సంపాదించాడు–విదేశాలలో కన్నుమూయడానికి'** అంటూ.

ఇలా ఊదాహరించుకుంటూ పోయే వేల్యంలో పడితే, ఒకే పుస్తకం ఒక్కచోటే రెండుసార్లు ముద్రించినట్లవుతుంది. ముద్రించుకోవాల్సింది ఇక పఠితల హృదయాల్లోనే మరి !

**'మనసు చాలా**
**తేలికయింది**

అందుకే
మనల్ని
తేలిగ్గా ముంచేస్తుంది'
'మనిషి

చాలాగొప్పవాడు
ప్రపంచాన్నే గెలిచాడు
మరోమనిషిని (మనసును)
తప్ప'

'మనసు
మిణుగురు పురుగులాంటిది
చీకటున్న చోటే వెలుగుతుంది'

వంటి భావాలు – పఠితలను బాగా ఆకట్టుకుని జ్ఞాపకం పూడిపోతాయి. 'అగ్ని'చెడును దహిస్తుంది'. 'పూలు' కొత్త ప్రకృతిని పరిమళింపచేస్తాయి అందంగా', 'అగ్ని' నాగరికతను ఇచ్చిన చరిత్ర! 'పూలు' మానవత్వమనే పూజా ద్రవ్యాలు! శైలజామిత్ర 'అగ్నిపూలు' ప్రయోజనాన్ని జ్వలించే భావసుమాలు! చీకటినుంచి వెలుతురులోకి ప్రయాణింపచేసేవి!!


'ఇవాళ్టి నా ఆహారం
అక్షరాలే.
అప్పుడప్పుడు
భావాల దాహం...అంతే!'

అని అంటుంది కవయిత్రి. 'కవిత్వమొక తీరని దాహం' అయినప్పుడు మండువేసవిలో చలివేంద్రం పెట్టడమే' – 'అగ్నిపూలు' శైలజామిత్ర వెలువరించడం! కవయిత్రిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

- సుధామ







# మినీ కవిత

ఒక వ్యక్తి
సంకెళ్ళతో
మోసుకొచ్చింది కాదు,
ఒక శక్తిగా
స్వేచ్ఛతో
దూసుకొచ్చింది..
(వెయ్యినూట పదహార్లు మినీ కవితల సంకలనం నుండి)

– రావి రంగారావు

వెలుతురు మనల్ని ఆశ్రయించడానికి పరిచయం అవసరం అనుకోదు.. అలాగే వెళ్లిపోవడానికి కూడా పర్మిషన్ అక్కర్లేకుండా తనంతట తానే వెళ్ళిపోతుంది..అలాగే మనలోని ఆలోచించగలిగే సత్తువ, స్పందించే హృదయం వుంటే భావాలు వాటంతట అవే ఒక అందమైన రూపాన్ని సంతరించుకుంటాయి.. అలా వ్యక్తచేసిన శైలజామిత్రగారి మినీకవితను స్పృశిద్దాం...

" పురుషుడు / ఆకాశం/ స్త్రీ / అవని/ స్త్రీ పురుషులిద్దరూ / ఎప్పటికీ కలవని సముద్రాలు" అనడంలోనే స్త్రీ, పురుషులు ఎంతగా కలిసి జీవిస్తున్నా, వారిలో భావాలు కలవడానికి, ఒక జీవితంగా కలిసి బతకడానికి ఇంత వ్యత్యాసముంది అని తెలియజేసే తీరు ఎంతో ఆశక్తిగా వుంది. ఈ మినీ కవిత్వం వీరికి పూర్తిగా అవగాహనకు రాకపూర్వమే వీరురాసిన ఒక కవితను మనం తెలుసుకుందాం..

" అతను చాలా మంచివాడు/ అడగని వారికి కూడా / సాయం చేస్తాడట/ భార్యకు తోడుగా / మరో భార్యనుకూడా" ఈ కవితలో పురుషవ్యతిరేకత తీవ్రంగా కనిపిస్తుంది.. పైకి పెద్దమనిషిగా కనబడుతూ అడగని వారికి కూడా సాయంచేస్తూన్నా మంచి వ్యక్తిగా సమాజంలో పిలవబడుతున్నా ఇంట్లో వున్న భార్యను కాదని మరోభార్యను తీసుకువచ్చి బాధపెడుతున్న తీరు బయటకు తెలియదు కదాని అని తెలిపే తీరులో నేడు పురుషుల ద్వంద్వవైఖరిని తెలియజేస్తుంది.

ఒకానొకప్పుడు మినీ కవిత్వం అందరికీ మెచ్చి అక్కడక్కడా చమక్కులు భూమిపై మెరిసాయి.. అలాంటి ఆలోచనతోనే పి.యస్. రవీంద్ర అనే కవిత ఒకటి జ్ఞాపకం వస్తుంది " ఉన్నపుడు/ నీ ఇంటి చుట్టూ/ కుక్కల కాపలా/ లేనప్పుడు/ ఇంటింటా/ నీవే కుక్కలా" అని అంటూ రచించిన ఈ కవిత విలువ ఎంత వర్ణించినా సరిపోదనిపించేలా వుంది...

అంతటి గొప్ప అర్థం వచ్చే శైలజామిత్ర మరో కవిత " ఉదయంనుండి/ ఇంటిముందు/ కుక్క అరుస్తూనే వుంది/ చాలాసేపు అర్థంకాలేదు / తర్వాత అర్థమయ్యింది/ నిన్నరాత్రి / ఒక మనిషిని కుక్క అన్నానని.." అనే కవితలో సమాజంలో మనిషి స్థానాన్ని తెలియజేస్తుంది ఇందులో స్త్రీ, పురుష వ్యతిరేకతలేదు.. కేవలం మనిషికి సంబంధించింది.. నేటి మనుషుల తీరు కుక్కలకున్నంత విశ్వాసం





కూడా లేని, కృతజ్ఞతలేని వారని, ఆఖరికి కుక్క కూడా తనపేరుతో మనిషిని తిట్టడం సహించలేకపోయిందని తెలిపేతీరులో వాస్తవం ప్రస్తుత సమాజ దుస్థితి తెలియజేస్తుంది.

సూర్యుడున్నంతవరకు ప్రపంచానికి చావులేదు..చీకట్లున్నంతవరకు చంద్రుని వెలుగుకు తిరుగులేదు మనస్సున్నంతవరకు మనిషికి చావులేదు..అయితే ఆ వెలుగు కళ్లనుండి రాలేదేమిటి? ఆ రాత్రి చాటున దాగున్న రహస్యాలేమిటి? మనసునుండి బయటపడలేని ఆ మాటలేమిటి అని ఆలోచిస్తే మనకు కనబడేది కేవలం కవిత్వం, అందులో ప్రత్యేకంగా మినీ కవిత్వం. అని చెప్పవచ్చు.. అలాకాకుండా నేడు వస్తున్న హైకూలు, నానీలు, చుక్కలు, రెక్కలు, లాంటివి స్వేచ్ఛను ఒక చట్రంలో బిగించి అవి తాము సృష్టించిన ప్రక్రియలంటూ ప్రచారాలు చేసుకోవడంలో అర్థం లేదు.. భావస్వేచ్ఛను బంధించే హక్కు ఎవరికీ లేదు.. ఎవరికితోచిన రీతిలో వారు తమకు తోచినట్లు తమ వ్యక్తి ప్రాధాన్యత కోసం చేసే ప్రయత్నాలు కేవలం ప్రయత్నాలుగానే మిగిలిపోతాయనేది నిజం..అలాంటి మినీ కవిత్వానికి అవసరంలేదు. ఎందరెందరో ప్రముఖులు ఆరుద్ర, కాళోజీ నుండి మినీ కవిత్వ ప్రయత్నాలు జరిగాయి.. ఎన్ని గజాలు రాసాడన్నది కాదు.. ఎన్ని నిజాలు రాసాడనేదే కవిత్వం" అని ఆరుద్రఅన్నా ..,"పుటకనీది/ చావునీది / బతుకంతా దేశానిది" అని కాళోజీ అన్నా, వాటిలోని ఆంతర్యం మాత్రం తక్కువ పదాలతో జీవిత సారాంశాల్ని తెలియజేయడమే..

అలాగే " నేను చచ్చిపోతాననే కదూ / నీ భాధ పిచ్చివాడా/ ఈ వ్యవస్థలో మనం బతికింది/ తొమ్మిది మాసాలే" మనం జీవచ్ఛవాలనమనీ, ఆవేదనే జీవితానికి పర్యాయపదమని, వివరించే తీరులో జీవితాన్నంతా నాలుగు వాక్యాలలో తెలిపిన ఘనత మన జింబోకే దక్కింది.. అదే విధంగా ఇక్కడ శైలజామిత్ర అంటారు..

" ప్రతి పుట్టుకకు / సాక్ష్యం అమ్మే అయితే/నేనింకా పుట్టలేదు/ ప్రతి మరణానికి మూలం నిందే అయితే/ నేనెప్పుడో మరణించాను"

అని తెలిపేతీరులో కూడా జీవితసత్యం మనకు బోధపడుతుంది.. చావు, పుట్టుకలకు మధ్య ఆంతర్యం వెదకటం ఎంతో కష్టమని తెలియజేస్తారు. మరోచోట..

# కవిత్వాన్ని నేను కాగితంపై రాయను..

'కవిత్వాన్ని నేను కాగితంపై రాయను.. ఏకంగా కాలం పైనే రాస్తాను.. కవిత్వానికి ఒక వస్తువునే వేలాడదీయను.. ఏకంగా సృష్టి చిత్రాన్నే అంటిస్తాను" అనేదే నా ఈ కవితల అంతర్గత భావం.

మినీ కవితల గురించి చెప్పేముందు తప్పకుండా మినీ కవితా ఉద్యమశిల్పి డా॥ రావి రంగారావు గురించి చాలా చెప్పాల్సిందే.. నేను మినీ కవితలు దాదాపుగా ఏడాదిన్నరనుండి రాస్తూనే వున్నాను. రాసినవన్నీ అచ్చుకూడా అయ్యాయి. మినీ కవిత అంటే ఇలా వుండాలి అని మాత్రం నాకు తెలియలేదు. ఏదో ప్రాస, భావం వుంటే చాలనుకున్నాను. ఇటీవల కాలంలో కొన్ని రాసి ప్రముఖ కవులు డా॥రావి రంగారావు గారికి పంపాను.. కానీ ఎలా వున్నాయనే విషయంలో మాత్రం సమాధానం రాలేదు. అలా రెండు మూడుసార్లు పంపినా సమాధానం లేకపోయేసరికి ఇకపై రాయకూడదనుకున్నాను.. తర్వాత రావి రంగారావు గారు సంపాదకత్వంలో మచిలీపట్నం 'సాహితీమిత్రులు' ద్వారా ప్రచురించన వెయ్యి నూట పదహార్లు మినీ కవితల సంకలనంలో కేవలం రెండు మాత్రం ముద్రణకు నోచుకున్నాయి.. అపుడర్థమయ్యింది ఇవి రెండు మాత్రమే మినీకవితలనిపించుకున్నాయి అని.. వెంటనే మళ్ళీ రాసి పంపడం ద్వారా సమాధానం లేకపోయేది.. ఇక మరోసారి రాసి సమాధానం రాకుంటే ఇకపై రాయకూడదనే నిర్ణయించుకున్నాను..మచిలీపట్నం "సాహితీమిత్రులు సభకు వెళ్ళినపుడు రంగారావుగారు నాకు 'వెయ్యినూటపదహార్లు' మినీకవితా సంకలనం ఇచ్చారు. పాతికేళ్ళకు పైగా వచ్చిన మంచి మినీ కవితల్ని రంగారావుగారు 'వెయ్యనూటపదహార్లు' అనే పేరుతో మినీ కవితా సంకలనం తెచ్చానని, అందులోని మినీ కవితలు చదువటంతోపాటు చివర ఇచ్చిన మినీ కవితా నిర్మాణ శిల్ప రహస్య వ్యాసాలు మనసుపట్టి చదవాలన్నారు. మినీ కవితా సంకలనంతోపాటు అనుబంధంగా మినీ కవితా నిర్మాణ శిల్పం గురించి 52 వ పేజీలో గొప్పగా విశ్లేషించారు. ఆ విశ్లేషణను మనసు పెట్టి చదివిన నేను మినీ కవిత్వంలోని ప్రత్యేక వ్యక్తీకరణ శక్తిని నేను అర్ధం చేసుకున్నాను. అంతే ఇక ఆపకుండా వందలకొలదీ మినీ కవిత్వాన్ని రాయగలిగాను. మినీ కవిత్వాన్ని రాయాలనుకున్నవారికి ఈ సంకలనం ఒక పెద్దబాలశిక్ష. ఆ తర్వాత రాసి





పంపిన కవితలకు 'మీరిప్పుడు అద్భుతమైన మినీ కవితలు రాస్తున్నారు.. పట్టు వదలకండి" అంటూ రావిరంగారావు గారే ఇపుడు నన్ను ప్రోత్సహిస్తున్నారు... ఆ రోజున నా ఆనందానికి అవధులు లేవు.. అంతే ఆ రోజునుండి నేటి వరకు దాదాపుగా 200 మినీ కవితల్ని రాసాను.. అందులో బాగున్నవి ఎంపికచేసి పుస్తకానికి **'అగ్నిపూలు'** అనే నామకరణం చేసి ...పుస్తకాన్ని 'సాహితీమిత్రుల సంస్థ ద్వారా ముద్రిస్తాననడం నాకు ఆనందంగానూ, మరోవైపు ఆశ్చర్యంగానూ అనిపించింది.. ముద్రించి విడుదలకు కూడా సిద్ధంచేసిన గురుతుల్యులు ప్రముఖులు, బహుముఖ ప్రజ్ఞాశాలురు, సాహితీమిత్రులు వ్యవస్థాపకులు డా॥ రావి రంగారావుగారికి నా కృతజ్ఞతలనే మాట చాలా చిన్నదేమో అనిపిస్తుంది.. సామాజిక ఉపయోగానికే వినియోగించాలి.. ఏదైనా మంచి పనులు చేయడానికి మన శక్తిని ఉపయోగించాలి.... అనే ఖచ్చితమైన భావాలు కలిగివుండి, ఎక్కడ ఎవరి కవిత్వంలో ఏమాత్రం మెరుపున్నా ప్రోత్సహించే స్వభావం గల వీరి పరిచయం నాకొక విజ్ఞానదాయకంగా మిగిలిపోతుందనే నమ్ముతున్నాను....

గాలికి ఆకు కదిలినంత వేగంగా నీటిపై ఆకు కదలదు.. అలాగే కవి అనుభవించినంత వేగంగా కవిత్వం సామాన్యులను అలరించలేదు.. ఎన్నిరూపాంతరాలు చెందినా నేటి ఆధునిక కవితా ప్రక్రియలన్నింటికి మినీకవిత్వం తల్లిలాంటిది.. బిడ్డలు ఎంతమంది వున్నా తల్లికి ఆనందమే...అలాగే మినీకవిత్వం రాస్తామని ఎంతమంది ముందుకొచ్చినా ఈ మినీ కవితా పితామహుడు రావి రంగారావు గారికి అమితానందమే...

అంతేకాకుండా అడగగానే ముందుమాట రాసిన ప్రఖ్యాత సాహితీ వేత్తలు సుధామ గారికి, ఓలేటి పార్వతీశం గారికి, నా పద్నాలుగేళ్ళ సాహితీ జీవితంలో మినీకవితలనే సరికొత్త అధ్యాయం శ్రీకారానికి కారకులైన డా॥ రావిరంగారావు గార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు... వీటిని ప్రచురించి ప్రోత్సహించిన ఆధునిక కవుల ప్రోత్సాహానికి మొదటి చిరునామా అయిన "నేటినిజం" పత్రికా సంపాదకులు శ్రీ బైసాదేవదాస్ గారికి, తేనెచినుకులు కవితా సంకలనంలోనూ, విజ్ఞానసుధలోనూ నా మినీకవితలను ప్రచురించి ప్రోత్సహించిన విజ్ఞానసుధ సంపాదకులు పాలెపుబాబు గారికి ప్రత్యేక ధన్యవాదాలు..

**- శైలజామిత్ర**

పురుషుడు
ఆకాశం.. స్త్రీ..
అవని
స్త్రీ,పురుషులిద్దరూ..
ఎపుడూ కలవని సముద్రాలు

ఆడపిల్లనని అమ్మ
పెళ్ళిచేయాలని నాన్న
పెళ్లయ్యాక భర్త
తల్లయ్యాక పిల్లలు వద్దు
పొమ్మన్నారు
ఒక్కసారి నేను వద్దనుకుంటే...

ఉదయంనుండి
ఇంటిముందు కుక్క అరుస్తూనే వుంది
చాలాసేపు అర్థం కాలేదు
తర్వాత అర్ధమయ్యింది
నిన్నరాత్రి మనిషిని కుక్క అన్నానని..

గుండెకు గాయమైతే
దానికి మందుంది..
గాయమే గుండెయితే
ఏ మందు సరిపోతుంది..?





ప్రతి పుట్టుకకు
సాక్ష్యం అమ్మే అయితే
నేనింకా పుట్టలేదు
ప్రతి మరణానికి
మూలం నిందే అయితే
నేనెప్పుడో మరణించాను...

ఇంద్రధనుసు కోసం
ఆకాశంలో వెదుకుతున్నావా
నీ పిచ్చిగానీ
ఇప్పుడు ఆ రంగులన్నీ
నేలపైనే వున్నాయిగా..

కళ్ళు తెరిస్తే
కనబడుతుంది లోకం
కళ్ళు తెరవకున్నా
కనబడుతుంది దేవాలయం
కళ్ళు తెరిచినా తెరవకున్నా
మచ్చుకైనా కనబడదు
హృదయం..

అమ్మనాన్నలు ఉత్తర దక్షిణలు
అక్క, అన్నలు తూర్పుపడమరలు
ఏ దిక్కూ లేక ఒంటరిగా నేను...

నీకోసం నేను
నాకోసమే నీవు
ఇద్దరినీ
వేరు చేసేది
నీది నాది

అతను
అనాథైతేనేమి
ఆకాశం తోడుగా వుంది
ఆమెకోసం
ఎందరుంటేనేమి
నిలువ నేలే లేదు

కొన్నాళ్లక్రితం
నా గుండె
ప్రశాంతతను కోల్పోయింది
ఇప్పుడా అవసరంలేదు
నా గుండె
తన ఉనికినే కోల్పోయింది...

పరుగులుతీసే కాలంలో నానీడ
కదులుతున్న కలంలో నా ఉనికి
కనబడటంలేదు
ఎందుకంటే
నేనున్నది కన్నీటి బావిలో





యంత్రాలు మధ్య యంత్రాలం
అంగుళం అంగుళం
ఆశావాదం
అవసరానికైనా జేబురుమాలులా
హృదయాన్ని వాడి చూద్దాం
సమయం లేదు కదా మరి..

అభద్రత  అపరిశుభ్రత
అపహరణలు
భాగ్యనగరంలో మూడు పువ్వులు
అందుకే  అధికారం
ఆరుకాలాలు...!

ఒకరు  ప్రేమలో పడ్డారు
మరొకరు  పెళ్ళిచేసుకున్నారు
పాపం
ఇద్దరూ బలిపశువులే..

చేతిలో సెల్‌ఫోన్
కంటిముందు ఇంటర్నెట్
నిండు జీవితాలలో
బంధాలన్నీ కట్

నాకు ఆకలయితే
కడుపు నింపుకోవడానికి
నీళ్లున్నాయి
అనురాగంలో
కనబడని
కన్నీళ్లున్నాయి

అమ్మనాన్న
సంసారానికి
రెండు చక్రాలు
అయితే
పిల్లలకు కావాల్సింది
నాలుగు చక్రాలు

స్త్రీ కొవ్వొత్తిలాంటిది
తను కాలిపోతూ
ఇతరులకు కూడా వెలుగునిస్తుంది
ఒకచోట ఇల్లు కాలుతోంది
మరోచోట గుండె కాలుతోంది

ఆకాశం చిల్లుపడ్డది
ఊర్లన్నీ
నిండిపోయాయి
తేలుతుందొక్కటే
రాజకీయం





అతను
ఉన్నట్లుండి ధనికుడయ్యాడు
అవునుమరి
అతను చేస్తున్నది
భాగ్యనగరంలో
దిష్టిబొమ్మల వ్యాపారం

గొప్పనటి
పొరపాటున కూడా
ఒంటిపై వలువలుండవు
గొప్పవ్యక్తి
మచ్చుకైనా కుటుంబానికి
విలువనివ్వడు..

చిన్నపుడు వానపడుతుంటే
కాగితపు పడవలు
నీటిలోకి వదిలేదాన్ని
ఇపుడు వానతోపనిలేదు..
కడుపులో వుండగానే
ఆడపిల్లని గాలిలో కలిపేస్తున్నాను..

అక్కడ సమయం బంగారం
నిద్రపోతే బతుకు వ్యర్థం
రాత్రంటే అంతరాయం
నేటి కార్పొరేట్ కాలేజీల స్వరూపం...

వానొస్తే తట్టుకోలేము
ఎండను భరించలేము
చలిని అనుభవించలేను
తేనె పూసిన కత్తులం
దేనికైనా కరిగిపోతాం...

చిన్నప్పుడు నా కొడుకు
ముద్దుముద్దుగా
ఆడుకుంటుంటే
మురిసిపోయాను
ఇపుడు ఏకంగా
నాతోనే ఆడుకుంటున్నాడు

వారు గజ ఈతగాళ్ళు
సాగరంలోకి ఉదయమనగా వెళ్ళి
రాత్రి బయటకు వచ్చారట
నేనే నయం ఇరవైఏళ్లకిందట
లోపలికెళ్ళి ఇప్పటిదాకా రాలేదు

అతను
మాట్లాడుతూ మాట్లాడుతూనే
పోయాడట పాపం
బహుశా భార్య
తనను కూడా
మాట్లాడించిందనే
ఆనందంతో కాబోలు





ఆవిడ ఎంతో కష్టపడి
కారు కొనుక్కుందట
అంతకన్నా కష్టపడి
ఇల్లు కూడా కొనుక్కుంది
అంత కష్టమెందుకు
ఖరీదైన మొగుడ్ని కొనుక్కుంటే పోలే..

అతను తుంటరిగా
తలంబ్రాలు పోస్తుంటే
తలొంచుకుని మురిసిపోయాను
కానీ గమనించలేకపోయా..
మూడు ముళ్ళు మాత్రం
మూడోసారని...

మనసు చాలా తేలికయింది
అందుకే మనల్ని
తేలిగ్గా ముంచేస్తుంది

మనం తినే
ప్రతి బియ్యపు గింజమీద
మనపేరే వుంటుందట
కందిపప్పుమీద
లేదనేమో
అలిగి ఆకాశంలో కూర్చుంది..

నవ్వులో
బాధ కనబడదు
నిశ్శబ్ధంలో
బాధ వుండదు
ఆరెంటకీ ప్రపంచంలో
స్థానం లేదు

ఈ దేశం
నాకేమిచ్చిందని
ఏమీ ఇవ్వలేదు
నువ్వేమిచ్చావు
నాకు లెక్కలు రావు

మనిషి
చాలా గొప్పవాడు
ప్రపంచాన్నే గెలిచాడు
మరో
మనిషిని తప్ప

నేను
రెండు సార్లు
మరణించాను
ఒకసారి
పుట్టినపుడు
మరోసారి
ప్రేమించినపుడు





గాంధీతాత
రోడ్లపై ఇప్పటికీ
నాకు ఎదురవుతుంటాడు
కాకుంటే
వెండిలో మెరుస్తుంటాడు

ఒంటరి చౌరస్తాలో
ఒంటరిగా నిలబడి
ఆలోచిస్తోంది రాజకీయం
ఎవరిని ఒంటరిని
చేద్దామా అని

మన పరిచయం
గొడవతో మొదలయ్యిందా?
ఇక మనకు మనం
పూర్తిగా అర్థమయినట్లే

నాన్న నన్నెప్పుడూ
ఆదరించలేదు
బహుశా నా ముఖంలో
వాళ్ల అమ్మ కనిపించిందేమో..

మా ఇంట్లో ఇల్లు లేదు
యంత్రాలు మాత్రం
బాగా పనిచేస్తున్నాయి

నదులన్నీ
నాతోనే వుంటాయి
కళ్లలోనూ
గుండెల్లోనూ
నిరంతర ప్రవాహం

కీకారణ్యంలో అర్ధరాత్రికూడా
కొన్ని పూలు పూస్తాయట
ఖాకీ వనంలో పట్టపగలు కూడా
ఉంచరని..

ఏడుకొండలు ఎక్కితే
ఆ శ్రీనివాసుడు
దయతో కనిపించాడు
ఏడేడు జన్మలు
కలిసి నడిచినా శ్రీవారు
శీమతికి కనిపించడు..





ఒక్క చినుకు పడితే చాలు
నగరమంతా జలమయం
అందుకే
జనవ నౌకల కదలికల్లో
అంతవేగం

దానికి చిన్నా పెద్దా
ముసలీ ముతకా తేడా వుండదు
అందరినీ లాలించి
నిద్రబుచ్చుతుంది
రైలుబండి
తల్లిలాంటిది

నువ్వు  ఓడిపోయావా?
బాధపడకు
మరోసారి ఓడిపోకు..

నిన్ను ఎపుడూ ఎవరూ ఏమీ
అనడంలేదా పైగా
పొగుడుతున్నారా
అయితే నువ్వు వారి దృష్టిలో
మనిషివి కానట్లే....

మా గుమ్మంముందు
ఆత్మీయమైన
చెప్పులజత
తెగిపోతే పారేసాను
ఎంతగా కుట్టించినా
అతుకు అతుకే కదాని..

రాత్రంతా
కురిసిన వర్షానికి
పాపం నిద్రలేదు
నాకంటినుండి వచ్చే
వరదను తట్టుకోలేక

ఆకాశమంత అత్తిల్లు
భూదేవంత పుట్టిల్లు
అందుకే
నాకు మిగిలింది శూన్యం

కనిపెంచిన అమ్మ
వంటింటిలో
ఒక మూలగా కూర్చుంది
కనిపించిన అమ్మాయి ఏకంగా
అతని గుండెలోనే కూర్చుంది





ఆ తల్లి
పేదరికపు వస్త్రంతో
శరీరాన్ని దాచుకోలేక
బిడ్డ కడుపు నింపుతోంది
ఒక అనాగరికుని
కళ్ళ ఆకలి తీరుతోంది

నగరంలో కాలుష్యపు కారుచీకట్లు
అందుకే నగరంలో
మనుషులు కనబడటంలేదు

మా ఇంట్లో
గడియారంపేరు
అనసూయ
మా అమ్మ

ఎంతగా జోలపాడినా
పాప నిద్రపోవడంలేదు
కళ్ళుమూసుకుంటే
నీరూపం
కనుమరుగవుతుంద

బంగారం లాంటి
అమ్మ
పోయింది
బంగారం మాత్రం
మిగిలింది

అందాలపోటీ
ఈసారి
మనసుకు జరిగింది
మూగతనం
గెలిచింది

ఒకప్పుడు
ఆ ఊరినిండి
పూరిగుడిసెలే..
ఇప్పుడవి
నిర్జీవ భవనాలే

నీళ్లట్యాంకరొచ్చింది
ఒక్కొక్కరికి
నాలుగు బిందెల నీళ్ళు
అందాయి
నలభై పురాణాలు తెలిసాయి





మాతృత్వపు తీయదనాన్ని
మరయంత్రం
నరుకుతోంది
మనసులేని యంత్రాలే
పుడుతున్నాయి

బిడ్డలు
మహాత్ములంతటివారు
కావాలని
ప్రతి తల్లి కోరుకుంటోంది
రూపాయిపై బొమ్మలుగా
ఎపుడో అయ్యారుగా

ఆఖరికి శ్మశానాన్ని కూడా
కబ్జాచేస్తున్నారట
వారు మానసికంగా పోయారని
వారికే అర్ధమయినట్లుంది

ఆకాశంలో పక్షి ఎగిరె గిరి
నిర్జీవంగా నేలరాలింది
అదేనయం
కాస్సేపయినా
హాయిగా ఎగిరింది

కొడుకుపుట్టాలని
ఎన్ని దేవాలయాలు
ప్రదక్షిణాలు చేసిందో పాపం
చివరకు ఆమెనివాసం
ఆ మెట్లమీదే..

దేశాన్ని
అభివృద్ధిపథంలో
నడపాలనేదే
ప్రభుత్వం ప్రయత్నం
బిక్షం చట్టబద్ధం..

అతను
చాలా మంచోడు
అడగకనే
అన్నీ ఇస్తాడట
భార్యకు తోడుగా
మరో భార్యను కూడా...

ఆమె దోసిట్లో
సముద్రం వుంది
కన్నీటి
ప్రవాహంతో....





మానవజన్మ
అపురూపం
నేడు
'అప్పు'రూపం

తెల్లవారితే కనబడేవి
పేపర్లనిండా
హత్యలు, ఆత్మహత్యలు
ప్రపంచమంతా
ప్రేమమయం

జై తెలంగాణా!
జైజై సమైఖ్యాంధ్రా..!!
అన్నమో..
రామచంద్రా...!!!

పాతికేళ్లుగా
ఆమె ర్యాంప్‌పై
నడుస్తూనే వుంది
కనీసం మనిషిగా కూడా
గెలవలేదు

నగరం రోడ్లు
తల్లిలాంటివి
అందుకే
ఆమెకు
పురుడు పోసాయి

ఇప్పుడు
బాల్యం విలువ
పెరిగిపోయింది
ఎల్‌కేజీకి
పాతికవేలు

వచ్చేటప్పుడు మనతో ఏదీ రాదు
పోయేటప్పుడు మనతో ఏదీ పోదు
కానీ వచ్చేటప్పుడు
పోయేటప్పుడు
మాత్రం ఖర్చే...

అల్మారా సర్దుతుంటే
ఫ్యామిలీ ఫోటో కనబడింది
అనుబంధాలకంటే
ఆభరణాలే
బరువుగా వున్నాయి





మనసు
మిణుగురుపురుగు
లాంటిది
చీకటున్నచోటే
వెలుగుతుంది

అనుభవం
ఉపాధ్యాయుడులాంటిది
అందుకే జీవితాంతం
బెత్తంతో కొడుతూనేవుంటుంది

నువ్వులేకనేను లేను
నువ్వంటే నాకిష్టం
నువ్వే కావాలి
అనేవి సంపాదనలో పడ్డాయి
సినిమాల్లో చేరాయి

వస్తోంది వసంతం
వడివడిగా వేపపువ్వుతో...
జీవితాన్ని
పచ్చడి చేయడానికి

చనిపోయిన ఆమెకోసం
అందరూ ఏడుస్తున్నారు
ఉన్నప్పుడు
ఎంతగా ఏడిపించారో
గుర్తొస్తోందేమో పాపం!!

రైతు గుండె
ఆగిపోయింది
పర్లేదు
రైతు
దేశానికి వెన్నెముక

బస్సునిండా
జనం భారీగా
ఉన్నారు
టికెట్టు కూడా..

ఇవాల్టి
నా ఆహారం అక్షరాలే...
అపుడప్పుడు
భావాలదాహం .. అంతే..





అమ్మ చంద్రుడు
నాన్న సూర్యుడు
బిడ్డలు నక్షత్రాలు
ఆనందం మాత్రం
తోకచుక్క...

చెయ్యిజారాకే
తెలుస్తుంది
దేనివిలువైనా
చెయ్యిజారకూడదనికాదు
మనసు మట్టికాదని

అతడు స్వదేశంలో
ఎంతో కష్టాలకోర్చి
మేధస్సును సంపాదించాడు
విదేశాలలో
కన్నుమూయడానికి

నవమాసాలు మోసేటప్పుడు
తల్లికి బిడ్డ బరువులేదు
ఆతల్లి మాత్రం
మోయకున్నా
బిడ్డకు అడ్డంగా....

ఆమె శరీరం
మంటల్లో కాలిపోతున్నా
మామూలుగావుందట
ఎదురుచూసిన
గుండెమంటల ముందు
పెద్దగా వేడిగా అనిపించలేదేమో..

మొన్నటి
మసీదు మందిరం
పావురాలు
ఇంకా కొట్టుకుంటూనే వున్నాయి
వాటి నివాసాలు
పాడవుతున్నాయని..

రెండు
భిన్నధృవాలను
ఒకటిగా కలిపేది
పెళ్లి..
ఒకే ధృవాన్ని
రెండుగా చూపేది
ప్రేమ

ఆమె
కాలాన్ని కూడా
జయించిందట
కాసుల
సాయంతో..





ఉదయంనుండి
వచ్చే కన్నీటిని
ఓపిగ్గా తుడుస్తోంది దస్తీ
అందుకే
అది నాదోస్తీ..

ఆ కళ్ల కెమేరాలో
ఎన్ని దృశ్యాలో
హృదయంలో
అచ్చయ్యేది మాత్రం
ఒకటే.

నాలుగు ముఖాలున్న
బ్రహ్మ సృష్టికర్త..
అందుకే మనిషి
నాలుగు విధాల ప్రవర్తన

బతికున్నపుడు అమ్మను
నాలుగుగోడలే ప్రపంచం చేసారు
పోయేక ఇన్నేళ్ల వేడిని
గుర్తించారేమో ఐస్‌లో వుంచారు..

కలం
పట్టినవారల్లా
కవులు కారు
విద్యార్థులు కూడా..

నిండు పౌర్ణమి
నింగి అంతా వెన్నెలే
ఎలావున్నా
నా గుండె మాత్రం
ఒంటరిసూర్యుడే

ఉదయం
పైకి వస్తూ సూర్యుడు
కిందికి వెళుతూ చంద్రుడు
ఇద్దరికీ మధ్యలో
కొండలదే తీర్పు

నేటి సినిమా
రిలీజయ్యింది
ఆదిమానవుడు
తొలిసారిగా
సిగ్గుపడటం నేర్చుకున్నాడు





చిన్నతనంలో
సైకిలెక్కాలంటేనే భయం
నేడు
ఏమాత్రం జంకకుండానే
జీవన ఇంజనుని
నవ్వుతూ నడిపేస్తున్నా...

ఎంతగా విసిగిస్తున్నా
ఆదేవుడు నన్నేమీ అనలేదు
ఎందుకంటే
ఆగుడిలోవెలిగించింది
నా గుండె దీపం...

ఎన్నో జ్ఞాపకాల మధ్య
నెమలీక ఒకటి
వంటిపైని
వాతలకు
మందుకదా..?

నగరం
నగిషీలు చెక్కుకుంటుంటే
పట్టుఅంచులు
మరచిన పల్లెలు
పంజాబి నేర్చుకుంటున్నాయి.

అతని వాహనం
మూడుచక్రాల సైకిలు
మనసుకు మాత్రం
రెండు చక్రాలే..

పదాలకు
గాయాలు తగిలితేనే
గేయం అవుతుంది
కమ్మని రాగం
మందు అవుతుంది..

స్త్రీకి
నవ్వు ఆభరణం
ఆభరణాలు లేకుంటే
నవ్వు రాదుగా మరి

ఓం.. శాంతి శాంతి
ఇప్పుడు లేదు
పెళ్లిచేసుకుని
విదేశాలకు వెళ్లిపోయింది





జీవితంలో
సుఖదుఃఖాలు
అనివార్యం
జీవితం మాత్రం
శూన్యం

వినువీధుల్లో
జాతీయజెండా
రెపరెపలాడుతోంది
ఒక్కరోజే కదాని

వయసు
పెరుగుతోంది
జుట్టుకు రంగు
వాడకం కూడా...

ఇది
పురుషాధిక్య సమాజం
నిజమే
సంఖ్యలో...

పిల్లలతో పాటు
ఆమె కూడా
అమెరికాలో స్థిరపడింది
అయితే
వంటింట్లో..

దేశం కోసం
ఏదో ఒకటి చేయాలి
కనీసం
ఉద్యమాలైనా..

అతను
మహాకవి
అందుకే
మహామహులంతా
అతనికి దూరం

గోడమీదిఫోటో
మసకబారినట్లుంది
తప్పదు
అప్పుడు ఇరవై దాటింది
ఇప్పుడు నలభైదాటింది





అమ్మ అన్నపూర్ణ
అందుకే
ఎపుడూ
కుతకుతాని ఉడుకుతుంటుంది..

అన్ని బంధాలకంటే
రక్తసంబంధాలే మిన్న
మసమేంటో తెలుసుకుని
మరీ లేవసంతగా
దెబ్బతీస్తారు..

ఆ నాయకుని
వెనుక గన్‌మేన్
నీ చావు
నాచేతుల్లోవుందని
హెచ్చరిస్తూ...

ఎన్నో బాధలు పడ్డాక
ఆమె హృదయం కోలుకుంది
మరొక బాధకై
ఎదురుచూస్తూ...

ఎప్పటినుండో
నాతోనే నడుస్తున్న
చందమామ లేడు
ఏ చుక్క
వలలో పడ్డాడో ఏమో..!

ఎన్నాళ్లనుండో
ఎదురుచూస్తున్న స్నేహం
కొత్తగా ఎదురైంది
పాత బాకీని
గుర్తుచేస్తూ..

ఎంతో
ట్రాజిడీ అయిన
ఆమె జీవితం
కామిడీ అయ్యింది
పెళ్ళయి..

చెదలు పట్టిన చరిత్ర
తిరగరాయాలి చెదలు
ఎందుకు
పట్టిందో అని...





నా చిటికిన వేలు పట్టుకుని
నాన్న అడుగులు నేర్పలేదు
అయినా నడిచాను
తన అడుగులో
అడుగువేసుకుంటూ..

ఆ కుర్చీ నాలుగు కాళ్ళతో
అందంగా వుంది
అందులో కూర్చున్న
వ్యక్తికి కూడా...

ఎందరో మహానుభావుల్ని
కన్న తెలుగు గడ్డ ఇది
అందుకే వారంతా
రోడ్డు వారగా నిలుచున్నారు
మట్టిగడ్డలై...

నలుగురినైనా నరికి కనీసం
నలుగురికైనా మనసిస్తేనే
సినిమాలలో హీరో..
అదే బాటలో నడిస్తే
బయట విలన్..

బస్సులో వెళుతుంటే
చెట్లన్నీ నావెంటే
దిగగానే
ఎక్కాల్సిన మరో బస్సుకోసం
నేనే ఒక చెట్టునై..

ఊరకరారు
మహానుభావులు
ఊరికే
పోరు కూడా...

ఆకాశంలో జాబిల్లి
మంచు దుప్పటి కప్పుకుంది
నేలపై పేదరికం ఏకంగా
ఆకాశాన్నే కప్పుకుంది...

ఆ ఇద్దరిమధ్య
బంగారు తాళి
బరువుగా వుంది
అవగాహన మాత్రం
తేలికయింది...





ఎవరో ఆకతాయిలు
తేనెతుట్టెను కదిల్చారు
చేదు తీపి కలయికల
ఉగాది వచ్చింది

ఆ ఇల్లు వేలం పాటను
గెలుచుకుంది
మా అనుబంధం ముందు
ఓడిపోయింది...

తాజ్ మహల్
తెల్లదనం తగ్గుతోందట
ప్రేమ విలువ
అర్థమయిందేమో...!!

మరణించిన మనిషి
ఏమవుతున్నాడో
తెలుసుకోవడానికి అన్వేషిస్తూ
గౌతమబుద్ధుడు
అడవులపాలయ్యాడట
అంతెందుకు కొన్నాళ్లు బయటే వుంటే
తెలిసిపోయేది..

విద్యలేనివాడు
వింత పశువు
విద్య ఉన్నవాడు
నిరంతర శిశువు

ప్రపంచంలో
మహిళలకు
రక్షణ లేదు
గృహహింస చట్టం వచ్చాక
పురుషులకు
ఇంట్లో కూడాలేదు

బాపూజీ
కలలు గన్న
భారతదేశం ఇది
అందుకే
కర్రతో కాపలా..

జయాపజయాలు
దైవాధీనాలు
నేడు
ధనాధీనం





అక్కడేమిటో
ఆ గుంపు..?
నిరంతరాహారదీక్షను
జయప్రదం
చేస్తున్నారు

అపుడెపుడో
తెల్లోళ్ళు
మనల్ని వేపుకు
తిన్నారట
అందుకే మనం
నల్లగా..

స్త్రీలను
గౌరవించడం
మన సాంప్రదాయం
ఇప్పుడు
ఆదాయం కూడా..

అతను వృద్ధుడైనా
నా ఇల్లు వెదుక్కుంటూ వచ్చాడు
అయితే
అక్కడ నా గతం
మాత్రమే వుంది

ఒక్కో కన్నీటి బొట్టు
వెనుక
సముద్రమంత సంక్షోభం
ఆ సముద్రం వెనుక
ఒక సంసారం

నగరంలో
కర్ఫ్యూ
రైతుకు వస్తోంది
స్టైన్‌ఫ్లూ

అపార్ట్‌మెంట్స్
శంఖుస్థాపన జరిగింది
పేదల
నిలువ నీడలేక
కన్నీటి కట్ట తెగింది

కార్మికులకు
ఉచిత
కార్పొరేట్ వైద్యం
ఆకలి జబ్బులకేమో..





జన'గణన' ప్రారంభమయింది
ఎందర్ని
ప్రాణాలతో వుంచుతారో
వేచి చూడాల్సిందే

ప్రేమ
పతాక స్థాయికి
చేరుకుంది
నిజజీవితంలోకాదు
సినిమాలో....

సాయంత్రం వేళ
కోవెల్లో కూర్చున్నా చల్లగా
భక్తుల కోరికలు వినీ వినీ
దేవుడు వేడిగా

కవిత్వం తేనెలూరు
తీయదనంగా
వింటున్నవారు మాత్రం
అందులో పడిన ఈగల్లా..

పెళ్ళిమండపంలో
బుట్టలనిండా
గులాబిపూలు
అందంగా వున్నాయి
వాటివెనుక ముళ్ళుకూడా

నగరంలో
పచ్చిక మైదానాలు లేవు
ఉన్నదంతా
తినడానికే
సరిపోదు కదా

అతను స్వీయ చరిత్రను
రాస్తున్నాడు
పరనిందను
వస్తువుగా తీసుకుని..

వీధిలో భిక్షగాడు
మేడలో గొప్పవాడు
నిదురపోతున్నారు
అయితే
ఒకరు దుఃఖాన్ని కప్పుకుని
మరొకరు ధనాన్ని కప్పుకుని